క్లుప్తంగా

పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి

సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్



మొక్కను బహూకరిస్తున్న ఏఎస్ఐగా పదోన్నతి పొందిన శంకర్‌రావు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ఏసీపీ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌రావు ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. శుక్రవారం అడిషనల్ డీసీపీ అడ్మిన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా సిద్దిపేట అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ మాట్లాడుతూ పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయన్నారు. సక్రమంగా విధులు నిర్వహిస్తూ డిపార్ట్‌మెంట్‌లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

ప్రారంభానికి నోచుకోని వాటర్ ట్యాంక్



పెద్ద మాసాన్‌పల్లిలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

తొగుట(దుబ్బాక): రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లు వృథాగా ఉంది. గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి గొడ్డలిపెట్టుగా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం వాటర్ ట్యాంక్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద వాటర్ ట్యాంక్ నిర్మించారు. అధికారులు ట్యాంక్‌కు పైప్‌లైన్ వేయడం మరిచిపోయారు. దీంతో వృథాగా పడి ఉంది. ట్యాంక్‌కు పైప్‌లైన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూస్ డీఈకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ వరలక్ష్మీస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అమర జవాన్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, బాల్య మిత్రులు

దుబ్బాక: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో బీఎస్ఎఫ్ శిక్షణ తీసుకుంటున్న దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందిన బొంగరపు మహేందర్ రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెల్సిందే. శుక్రవారం ఆయన చదువుకున్న దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, బాల్యమిత్రులు మహేందర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఎస్ఎఫ్‌లో శిక్షణ పొందుతున్న మహేందర్‌రెడ్డి అకాల మరణం చాలా బాధాకరమన్నారు. నివాళులర్పించినవారిలో హెచ్ఎం ప్రవీణ, ఉపాధ్యాయులు విధుమౌళి, శ్రీనివాస్, బాల్య మిత్రులు నాగరాజు, బాబు, సంతోష్, షారుఖాన్ తదితరులున్నారు.

కరాటేలో జగదేవ్‌పూర్ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులతో సుమన్ తదితరులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో జగదేవ్‌పూర్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు మాస్టర్ ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. ప్రతిభ చూపిన సౌమ్య, బేబి షాలిని, భరత్‌కు తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ చైర్మన్ హీరో సుమన్ చేతులమీదుగా బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్ అందజేశారన్నారు. ఆత్మరక్షణ కోసం ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలని సూచించారు.

అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలి

- మంత్రి హరీశ్‌రావు చొరవతో ప్రగతి పథంలో గ్రామాలు
- ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు
- ఎంపీపీ అధ్యక్షత సర్వసభ్య సమావేశం
- సర్పంచ్‌లు, ఎంపీటీసీల గైర్హాజరుతో ఎంపీపీ అసహనం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

సిద్దిపేటరూరల్: నియోజకవర్గం దేశంలోనే ఆదర్శంగా మారుతున్న క్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి భాగస్వామ్యంతో సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు వారి ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభదృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయన్నారు. రైతుల కోసం పథకాలను ప్రవేశపెడుతూ రైతు ప్రభుత్వంగా మారిందన్నారు. అదేవిధంగా కంటి సమస్యతో ఎవరూ బాధపడొద్దనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. బ్యాంకు రుణాలు కట్టలేక ఇబ్బందులు పడుతున్న వారి కోసం మంత్రి బ్యాంకర్లతో చర్చించి తెచ్చిన వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా రైతులు రుణాలు చెల్లించి రుణ విముక్తి పొందాలన్నారు. ఆయిల్ పాం సాగుపై మరింతగా అవగాహన కల్పించి, సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. సాంప్రదాయ పంటలను కాకుండా అధిక ఆదాయం వచ్చే పంటల సాగువల్ల ఆర్థికంగా బలపడేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుంటూ రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామాలుగా మార్చుకోవాలన్నారు. సభకు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరు కావడంపై ఎంపీపీ విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ యాదగిరి, ఎంపీడీఓ సమ్మిరెడ్డి, ఎంపీటీసీలు ఎల్లం, బాబు సర్పంచ్‌లు సదాశివారెడ్డి, లక్ష్మీ, దేవయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎర్రోళ్ల శ్రీనివాస్



శ్రీగిరిపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని రిమ్మనగూడలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి గ్రామసర్పంచ్ చెరుకు చంద్రమోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల్లో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్, మర్కుక్ మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బెండ మధు, కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, ఏఎంసీ డైరెక్టర్ ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టమైన రంగంలో రాణించాలి



ఏవియేషన్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమకిష్టమైన రంగంలో రాణించాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశశి అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఫ్లయి ఫస్ట్ ఏవియేషన్ అకాడమీ వ్యవస్థాపకులు గ్రీష్మ భండారీ, కుమారస్వామి ఏవియేషన్ రంగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విమానాల క్యాబిన్, క్రూ ట్రైనింగ్, గ్రౌండ్ హ్యాండ్లింగ్, ట్రైనింగ్, పైలెట్ ట్రైనింగ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శార్వాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సౌజన్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

పట్టణంలో మోస్తరు వర్షం



రాలిన మామిడి పిందెలను సేకరిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట పట్టణంలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం మేఘావృతంగా ఉండటంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు రోజుల కంటే కాస్త తగ్గడంతో చలి పెరిగింది. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో కురిసిన వర్షానికి మామిడి పిందెలు రాలాయి. సిద్దిపేటలో పలు కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దుకాణాలు, కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లే సమయంలో వర్షం కురియడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న అధికారి రంగనాథ్

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూరు ప్రాథమిక పాఠశాలను సెక్టోరియల్ అధికారి రంగనాథ్ ఆకస్మికంగా సందర్శించారు. శుక్రవారం పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించారు. అనంతర ం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదివి టెన్త్ ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలుపాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు ఉప్పలయ్య, ప్రభాకర్ సత్యనారాయణ, సులోచన ఉన్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

నర్సాపూర్: పట్టంలోని ఫంక్షన్ హాల్ వద్ద అడ్డగోలుగా పార్కింగ్ చేయడంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా ట్రాఫిక్‌లో అంబులెన్స్ చిక్కుకుంది. శుక్రవారం నర్సాపూర్ – సంగారెడ్డి మార్గంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెండ్లి వేడుక జరిగింది. పెండ్లికి వచ్చిన వారు తమ వాహనాలు రోడ్డుకు ఇరుపక్కల నిలిపారు. కొందరు రోడ్డుపైకి వచ్చేలా తమ వాహనాలు నిలుపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై ఇరు వైపుల నుంచి ఎక్కువ సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది. అదే సమయంలో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం వైపు నుంచి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న అంబులెన్స్ ట్రాఫిక్‌లో సుమారు 15 నిమిషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుంది.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఏఈఓ రాజశేఖర్‌గౌడ్

కౌడిపల్లి(నర్సాపూర్): వరి పంటలో రైతులు కాండం తొలుచుపురుగును నివారించుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాయిలాపూర్‌లో రైతులకు పంటలసాగు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంట పొట్ట దశలో కాండం తొలుచుపురుగు ఆశిస్తుందని, నివారణ కోసం ఎకరాకు ప్రోఫినోపాస్ 400మి.లీ లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలని చెప్పారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి ఫిబ్రవరి 02, 2019 లోపు పట్టాదారు పాస్‌బుక్ ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు. భార్య భర్తలో ఒక్కరికే పథకం వర్తిస్తుందన్నారు. ఈకేవైసీ చేసుకోని రైతులు త్వరగా ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కురుమ శేఖులు, గ్రామ రైతుబంధు సమితి కోఆర్డినేటర్ రాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

రేగోడ్ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ అనిత



మాట్లాడుతున్న సర్పంచ్ అనిత

రేగోడ్(మెదక్): గజ్వాడ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ అనిత అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గజవాడ సర్పంచ్ అనిత మాట్లాడుతూ.. గజవాడ గ్రామంలో నీళ్లు సక్రమంగా రావడం లేదని అన్నారు. అదేవిధంగా మర్పల్లి సర్పంచ్ సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సభా దృష్టికి తెచ్చారు. సర్వసభ్య సమావేశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యలను చర్చికుండా, మొక్కుబడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీతా రావమ్మ, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీపీ సరోజన, వైస్ ఎంపీపీ వినీల, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కృషి

హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితేల సతీశ్‌కుమార్



ఆలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): స్వరాష్ట్రంలోనే దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని, సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితేల సతీశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో రూ.30 లక్షలతో పంచముఖ లింగ సోమేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే బస్వాపూర్‌లో రూ.10 లక్షలతో గౌడ సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్ రావు, సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, సీనియర్ నాయకుడు కొక్కుల సురేశ్, ఆలయ కమిటీ చైర్మన్ సుధగోని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



చెక్కును అందిస్తున్న నాయకులు

మర్కుక్(గజ్వేల్): కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కర్కపట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిన్నరాములు ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. బీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో రూ.2 లక్షల బీమా మంజూరైంది. శుక్రవారం ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే సైనికులని, వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అలాగే పాములపర్తి గ్రామానికి చెందిన ప్రభాకర్‌కు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం



నంగునూరులో తపస్ సంబురాలు

నంగునూరు(సిద్దిపేట): ఉపాధ్యాయుల సమస్యలపై తపస్ పోరాటం చేస్తుందని ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తపస్ బలపర్చిన ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం నంగునూరులో స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వంగ నర్సింరెడ్డి, నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు జయపాల్‌యాదవ్, రాముడు, శ్రీకాంత్, వీరారెడ్డి, వెంకటేశ్, సతీశ్, చంద్రకాంత్, మురళి, సుజాత, భాస్కర్, సురేందర్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందడంతో శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతకు ఈ ఎన్నికల గెలుపు నిదర్శనమన్నారు. తెలంగాణలో తమ బలం పెరిగిందని రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత మల్లేశం యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీపీయూఎస్ ముందుంటుందని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీధర్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్‌రెడ్డి ఘన విజయం సాధించినందుకు సిద్దిపేట బస్టాండ్ చౌరస్తాలో విజయోత్సవ సంబురాలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పాలమూరు, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించినందుకు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్, మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిప్రమాద శాఖ అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం పెద్దశంకరంపేట అగ్నిమాపక శాఖ అధికారులు స్థానిక డాన్ బాస్కో పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్నిమాపక యంత్రం సహాయంతో మంటలార్పే విధానంపై విద్యార్థులకు, సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఆవరణలో అగ్నిమాపక సాధనాన్ని అందుబాటులో ఉంచుకోవాలని ఎస్ఎఫ్ఓ శ్రీశైలం సూచించారు. వేసవిలో అగ్నిప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని వీటిని నివారించడానికి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది రాజేందర్, గోపాల్, రాజశేఖర్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన**

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ గ్రామంలో పోచమ్మ దేవాలయం నిర్మించేందుకు సర్పంచ్ నర్సింహులు యాదవ్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల సహకారంతో గ్రామ దేవతల ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం జిల్లా డైరెక్టర్ సత్తయ్య, ఉప సర్పంచ్ రామచంద్రం పాల్గొన్నారు.

◆ **కొనసాగుతున్న హాథ్‌సే హాథ్ జోడో యాత్ర**

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్ర మండలంలో కొనసాగుతోంది. శుక్రవారం ఆకునూరు, కాశెగుడిసెలు, రాంపూర్ గ్రామాల్లో యాత్ర నిర్వహించారు. యాత్రలో జెడ్పీ ఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి, మైనార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ ఇక్బాల్, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్మురవి, పార్టీ కొమురవెల్లి మండల అధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, మద్దూరు మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **టీఎస్ పీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి**

బెజ్జంకి(సిద్దిపేట): రేయింబవళ్లు చదివి పరీక్షలు రాసిన టీఎస్‌పీఎస్సీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం బెజ్జంకిలో మాట్లాడుతూ పరీక్షలను సక్రమంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షలు రాసిన ఒక్కో అభ్యర్థికి రూ.లక్ష నష్టపరిహారమివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దోనె అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **న్యూట్రిషన్ కిట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యం**

చేర్యాల(సిద్దిపేట): న్యూట్రిషన్ కిట్స్‌తో బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ దీపాంజలి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆయుష్ హెల్త్ కిట్స్‌ను మున్సిపల్ చైర్మన్ స్వరూపరాణి తో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రంగనాథ్, కౌన్సిలర్ చంటి పాల్గొన్నారు.

◆ **5వ తరగతి ప్రవేశాలకు గడువు పెంపు**

హుస్నాబాద్: సాంఘిక, గిరిజన, బీసీ సాధారణ గురుకుల విద్యా సంస్థల్లో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణకు విధించిన గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడగించినట్లు హుస్నాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షలు ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తెలంగాణ వ్యాప్తంగా జరుగుతాయన్నారు.

◆ **అభివృద్ధి పనుల ప్రారంభం**

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపూరి గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ ప్రారంభించారు. శుక్రవారం గ్రామంలో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన బస్టాండ్ నిర్మాణానికి, శివారు గ్రామమైన దూదేకులపల్లిలో దేవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోషి, ఉపసర్పంచ్ ఎల్లేశం, పంచాయతీ కార్యదర్శి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా స్వయంపాలన**

మర్కుక్(గజ్వేల్): మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీఈఓగా దినేష్, ఎంఈఓగా అఖిల్, హెచ్ఎంగా మైత్రి, ఉపాధ్యాయులుగా వెన్నెల, సంధ్య, కార్తీక్, హరిప్రసాద్, భరత్ వ్యవహరించారు. హెచ్ఎం ఓంకార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

◆ **బీఎస్పీ నాయకులను నిర్బంధించడం తగదు**

బెజ్జంకి(సిద్దిపేట): గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని దీక్ష చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులను అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం తగదని ఆపార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిశాని రాజమల్లు, మండల అధ్యక్షుడు తిరుపతి శుక్రవారం అన్నారు. నిరుద్యోగ, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే బీఎస్పీ ఇటువంటి నిర్బంధాలకు వెరువదన్నారు.

◆ **మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి**

మద్దూరు(హుస్నాబాద్): వేసవిలో నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం దూళ్మిట్ట మండలంలోని దుబ్బతండా నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలో పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నర్సరీలో గ్రామస్తులకు ఉపయోగపడేలా పండ్ల, పూలు తదితర మొక్కలు పెంచాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ సుజాతశ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ లక్ష్మి తదితరులు ఉన్నారు.

◆ **తెలుగు కేలండర్ ఆవిష్కరణ**

దుబ్బాక: దుబ్బాకలోని శివమార్కండేయ ఆలయంలో ప్రధాన అర్చకుడు శ్రీమాన్ నల్లా రాంబాబు భార్గవ రూపొందించిన శ్రీశోభకృత్ నామ సంవత్సర నూతన తెలుగు కేలండర్‌ను పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల తిరుపతి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమమంలో పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ **మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి**

వర్గల్(గజ్వేల్): రుణాలు సద్వినియోగం చేసుకుంటూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని వర్గల్ జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్ అన్నారు. శుక్రవారం సెర్ప్–ఐకేపీ ద్వారా బ్యాంకు రుణంతో వర్గల్‌లో కాస మాధవి ఏర్పాటు చేసుకున్న కిరాణ దుకాణాన్ని సర్పంచ్ గోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీ సత్యనారాయణ, సుభాష్ గౌడ్, భాస్కర్, పద్మలత, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో: 17జిజెడబ్ల్యు41, 41ఏ: వర్గల్‌లో కిరాణ దుకాణం ప్రారంభోత్సవంలో జడ్పీటీసీ బాలమల్లు యాదవ్ తదితరులు

◆ **కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు**

దుబ్బాకటౌన్: దుబ్బాక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెంటెంట్ హేమరాజ్ సింగ్ ఆదేశాల మేరకు సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. డ్యూటీ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

◆ **కూలిన ప్రభుత్వ పాఠశాల ప్రహరీ**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం బొప్పాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలింది. బొప్పాపూర్ ఎమ్మెల్యే రఘునందన్‌రావు స్వగ్రామం కావడంతో పాఠశాల అభివృద్ధిపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారని స్థానిక నాయకులు తెలిపారు. పాఠశాలను అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే తన సొంత నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రహరీ కూలడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ప్రహరీని ఎవరైనా కూల్చి వేశారా? ఎందుకు కూల్చి వేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.